# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు ఏలూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.
- ❖ వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈ నెల 30న ప్రసారమవుతుంది.

======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పౌరసేవలు, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే.. దీనికి సంబంధించి స్మార్ట్ ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంను అమలు చేయాలని, కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని పేర్కొన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ నిర్వహిస్తున్న డేటా లేక్ ద్వారా సమాచార సేకరణ జరగాలని సూచిస్తూ.. రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు 2026 జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని స్పష్టం చేశారు. 25 రకాల వివరాలతో పాటు పీ-4 లాంటి అంశాలను అందులో చేర్చాలన్నారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలని సూచించారు.

======================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్.. ఏలూరు జిల్లా ఐ.ఎస్. జగన్నాథపురంలోని శ్రీ కనకవల్లీ సహిత లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఈరోజు సందర్శించారు. వేదపండితులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఉపముఖ్యమంత్రి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి.. ఇటీవల 1.5 కోట్ల రూపాయల వ్యయంతో మరమ్మతులు చేపట్టిన పొంగుటూరు - లక్కవరం రోడ్డును రాజవరం వద్ద.. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలసి పరిశీలించారు.

=====================

వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో ఆయన ఈరోజు పర్యటించి, రైతన్న సేవలో మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంతమాగులూరు మండలం  కొమ్మాలపాడు రైతులతో సమావేశమై, వారి సమస్యలపై అరా తీశారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 37 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. 30 లక్షల రూపాయల CSR నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి సంవత్సరం రైతుల ఖాతాల్లోకి 20 వేల రూపాయలు జమ చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

=====================

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (IFFI)లో భాగంగా ఈరోజు జరిగిన 5వ రోజు కార్యక్రమాలకు సినీ ప్రియులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నేటి సినిమా ప్రదర్శనలలో భాగంగా జపనీస్ చిత్రం - టూ సీజన్స్, టూ స్ట్రేంజర్స్, అల్బేనియన్ చిత్రం హనా, గోవింద్ నీలాహ్నా పార్టీ వంటి సినిమాలు ప్రదర్శించబడ్డాయి. చలన చిత్రాల్లో ఎడిటర్ పాత్ర కీలకమైనదని ప్రఖ్యాత దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

=====================

రైతులకు మరింత మేలు జరిగేలా పంచ సూత్రాలను అమలు చేయనున్నామని శాసనసభ ఉప సభాపతి కె. రఘురామ కృష్ణంరాజు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రైతన్న సేవలో మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా రైతులు సాంప్రదాయ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ అధికారులు అభ్యుదయ రైతులను కలుపుకొని ప్రతి రైతు ఇంటికి వెళ్లి వ్యవసాయ యంత్రాల వినియోగం వల్ల కలిగే లాభాలు, పంట మార్పిడి, రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగించాలని సూచించారు. రానున్న 5 సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు ప్రభుత్వం 5 సూత్రాలతో కార్యాచరణను అమల్లోకి తీసుకురావడం జరిగిందని రఘురామ కృష్ణంరాజు తెలియజేశారు.

======================

దేశ ప్రజల ఐక్యత కోసం ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఎనలేని కృషి చేసారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సర్దార్ పటేల్ 150వ జయంతి మహోత్సవాలలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని డిఎన్ఆర్ కళాశాలలో ఈరోజు నిర్వహించిన `యూనిటీ మార్చ్`లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటేల్ గొప్పతనాన్ని, ఆయన త్యాగ నిరతిని ప్రజలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా సేకరించిన మట్టి, ఇనుముతో 597 అడుగుల ఎత్తైన 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ`ని గుజరాత్‌లోని నర్మదా నది తీరంలో నిర్మించడం జరిగిందని పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

అనంతరం పటేల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటామని విద్యార్థులతో కలిసి కేంద్రమంత్రి సర్దార్ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు.

======================

రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె. ఎస్. జవహర్.. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడిలో ఒక వర్గంపై దాడి ఘటనలో బాధితులను ఈరోజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడచినా ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని, వారి కుటుంబాలకు ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బండ్లమూడి దాడి కేసులో బాధితులపై పెట్టిన కేసులను తొలగించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని ఛైర్మన్ తెలియజేశారు.

======================

చిన్నారుల్లో పౌష్టికాహారం, పరిశుభ్రత లోపం లేకుండా చూడాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం వన్ స్టాప్ సెంటర్ ఆవరణలో "బేటీ బచావో... బేటీ పఢావో" కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు.

======================

మలక్కా జలసంధి, సమీపంలోని దక్షిణ అండమాన్ సముద్రంపై అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది.

======================
======================